: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి


ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 1 | 02-10-2023 | పుటలు : 4

## అక్టోబర్ 2
# గాంధీ జయంతి


" నీ విద్యుక్త ధర్మాన్ని నీవు నిర్వర్తించటమే ప్రేమ "
- మహాత్మా గాంధీ




2020 గాంధీ జయంతి రోజున నన్నయవాణి సంచికను ఆవిష్కరించారు నాటి ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావుగారు. విశ్వవిద్యాలయ సమాచారాన్ని, విద్యార్థులు,అధ్యాపకుల ఆలోచనల్ని అక్షరబద్ధం చేస్తూ విశ్వవిద్యాలయ వెబ్సైట్లో నిక్షిప్తం చేస్తోంది. మూడేళ్లు పూర్తి చేసుకుని నాల్గవ ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సహకరిస్తున్న విశ్వవిద్యాలయ అధికారులకు, ఆచార్యులకు, విద్యార్థులకు, హితైషులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

**సంపాదకవర్గం**
**నన్నయవాణి**

## అక్టోబర్ 2
## శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి జయంతి



మనకు లభించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను రక్షించుకోవటం కేవలం సైనికుల పని మాత్రమే కాదు. ఇది మొత్తం దేశ ప్రజల కర్తవ్యం.

**- లాల్ బహదూర్ శాస్త్రి**

## నన్నయ ఎగ్జిక్యూటివ్
# కౌన్సిల్ మెంబర్స్‌కు అభినందన!





ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్ కు యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎఫ్లియేటెడ్ కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్ ను సన్మానించుకోవడం హర్షనీయమన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఈసీ సభ్యులంతా కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా విద్యా సంస్థలు పని చేయాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని విద్యాసంస్థలు చక్కని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యూనివర్సిటీలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించి అనుబంధ కళాశాలల అధ్యాపకులకు శిక్షణ అందిస్తామని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఎ, ఎ ప్లస్ గ్రేడ్ సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దేశ విదేశాలలో డిమాండ్ ఉన్న నూతన కోర్సులను యూనివర్సిటీలో ఏర్పాటు చేసి గోదావరి జిల్లాల యువతకు అందుబాటులోనికి తీసుకువస్తున్నామన్నారు. గ్రామీణ యువతకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు జాతీయ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామన్నారు. ఆయా ఉన్నత సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటూ పరస్పర సహకారంతో నన్నయ విశ్వవిద్యాలయాన్ని ప్రగతి పథంలో తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ నూతనంగా నియమితులైన ఈసీ మెంబర్స్ కు శుభాకాంక్షలు తెలియజేసారు. వీసీ ఆచార్య కె.పద్మరాజు విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. వీసీగా ఆయన పని చేస్తూ అందరితో కలిసి పని చేయిస్తున్నారని, విశ్వవిద్యాలయ ప్రగతికి కృషి చేస్తున్నారని చెప్పారు. అనుబంధ కళాశాలలు విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీల అభివృద్ధిలో ఈసీ మెంబర్స్ పాత్ర కీలమైనది, ఈసీ మెంబర్స్ గా నియమితులైన సభ్యులకు అభినందనలు తెలిపారు. యూనివర్సిటీలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించి కళాశాలలకు నాణ్యమైన విద్యను అందించేందుకు సహకరించాలని అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎఫ్లియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈసీ చైర్మన్ వీసీ ఆచార్య కె.పద్మరాజు, సెక్రటరీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఈసీ మెంబర్స్ డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.కె.జ్యోతి, యూనివర్సిటీ ఇంజనీర్ డా.కె.నూకరత్నం, ఎ.ఎస్.డి. కాలేజ్ లెక్చరర్ వసంత లక్ష్మి, ఈ.డి.సి.ఐ.ఎల్ జనరల్ మేనేజర్ డా. షేక్ సులేమాన్, ప్రెసిడెంట్ అండ్ కరస్పాండెంట్ లిటిల్ రోస్ విద్యాసంస్థలు గంధం నారాయణ రావులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. వీసీ ఆచార్య పద్మరాజు నిరంతరం యూనివర్సిటీ ప్రగతి కోసం కృషి చేస్తున్నారని, అందర్నీ కలుపుకుంటూ వర్సిటీ అభివృద్ధికి పాటుపడుతున్నారని, వీసీ మార్గదర్శకత్వంలో అభివృద్ధి దిశగా పయనిస్తామని ఈసీ మెంబర్స్ తమ అభిప్రాయాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, యూనివర్సిటీ ఎఫ్లియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నరసింహరావు, సెక్రటరీ రమణరావు, గౌరవ అధ్యక్షులు డా.టి.కె.విశ్వేశ్వరరెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా.ఎన్.శేషారెడ్డి, ఏపీ స్టేట్ డిగ్రీ కాలేజెస్ మేనేజ్మెంట్ జాయింట్ సెక్రటరీ హబీబ్ బాషా,వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మాజీ మరియు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.





## నివాళి

సాగుదారుల బాగు కోసం,
పంట దిగుబడుల కోసం
నిరంతరం పరితపించి, పరిశ్రమించిన
విఖ్యాత శాస్త్రవేత్త పద్మ విభూషణ్
ఎం.ఎస్. స్వామినాథన్. భారత ఆహార
రంగ స్వయం సమృద్ధిని అభిలషించి
సేద్య విధాన క్రతువులో మమేకమైన 98
ఏళ్ల పరిపూర్ణ సార్థక జీవితం ఆయనది
ఆకుపచ్చని వ్యవసాయ క్షేత్రాల్లో రత్న
మాణిక్యాల దిగిబడులని లక్షించిన
కాంతదర్శి ఆయన.
ఆ అసాధారణ కృషీవలుని దివ్య స్మృతికి
నివాళి!!

- నన్నయవాణి

# ఉపకులపతి ఉవాచ



## వారధి

*గోడలు కాదు కట్టుకోవాల్సింది, వంతెనలు అన్నారో కవి. అవును. గోడలు విభజిస్తాయి. వంతెనలు కలుపుతాయి. వారధి రెండు ప్రాంతాల అభివృద్ధికి సంబంధ బాంధవ్యాలకు పునాది. ప్రయాణం సుఖవంతమవుతుంది. సమయం సద్వినియోగమవుతుంది. రాకపోకలకు సరుకు రవాణాకు తేలికవుతుంది. ప్రాంతాలు కలిసేసరికి ప్రగతి వేగవంతమవుతుంది.*

*చదువుకున్న తరగతి గదులు, పాఠాలు చెప్పిన మాస్టార్లు, నడచిన వరండాలు, సేదతీరిన చెట్ల కొమ్మలు,సిమెంట్ బెంచీలు, వెలుగునిచ్చిన పుస్తకాలు... ఇవే చదువుకున్న విద్యార్థుల జీవితాల్లో నిండిపోయిన జ్ఞాపకాలు. ఎవరికైనా అంతే. చిన్న బడి, పెద్ద కళాశాల, లేదంటే విశ్వవిద్యాలయం. ఏదైనా ఒకటే. అక్కడ చదువుకున్న విద్యార్థులుగా ఆ జ్ఞాపకాలు అందరికీ చాలా ఆనందాన్నిస్తాయి. అక్కడ జరుగుతున్న అభివృద్ధి విశేషాలు తెలుస్తుంటే ఇంకా సంతోషం కలుగుతుంది. చదువుల చెట్టు కింద ఒక కాలంలో గడపటం వలన కదా మిత్రులయ్యామనే భావన గొప్ప అనుభూతినిస్తుంది. చిటికెడు నవ్వుల గంధం, గుప్పెడు వెన్నెల రజను, దూరంగా కొండల మీద కనిపించే మూరెడు ఇంద్రధనస్సు, దోసెడు గోదావరి నీళ్లు కలిపి తయారుచేసిన శిల్పం విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న రోజుల జ్ఞాపకం. ఆ జ్ఞాపకం మనసుకు హాయిగొలిపే మరో ప్రపంచం. మనం ఏది విత్తుతామో అదే మొలుస్తుందనేది ప్రకృతి సూత్రమైతే మనిషికి అదే వర్తిస్తుంది. మన చదువులు, పుస్తకాలు, మాస్టార్లు మన భవిష్యత్తు సౌధానికి పునాది.*

*" నన్నయవాణి " యూనివర్సిటీ ఇన్ హౌస్ జర్నల్ విద్యార్థులకు విశ్వవిద్యాలయానికి ఒక వారధి.*
*చదువుకున్న విద్యాలయానికి ఇప్పుడున్న ఉద్యోగానికి, ప్రాంతానికి ఒక వారధిలా, ఒక వంతెనలా విషయాలను మీకు చేరవేస్తూ ఉంటుంది.నన్నయవాణి జర్నల్ విజ్ఞాన ప్రపంచానికి ధీనిధి! ప్రగతి ప్రయాణానికి సారథి!! విద్యా సమాచారాలకు సన్నిధి!!!*

***నన్నయవాణి 4 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు!!***

ఆచార్య కె.పద్మరాజు


# మంచిమాట



మీ ఆలోచనలు
ఎల్లప్పుడు ఉన్నతంగా
ఉండాలి. ఎందుకంటే మీ
ఆలోచనలు మీ మాటల్లో
ప్రతిబింబిస్తాయి.

- మహాత్మా గాంధీ

# సంపాదకీయం



## ఓ మహాత్మా..!!

జాతిపిత 'ఫాదర్ ఆఫ్ ది నేషన్' మన బాపూజీ! అసంఖ్యాక భారతీయుల దారిద్ర్య జీవన సంకేతంగా కొల్లాయిగట్టి *'Naked fakir of India* అని చర్చిల్ చేత వక్కాణింపబడ్డారు. ఎన్నేళ్లు గడిచినా ఆయన అమరజ్యోతి ప్రపంచాన్ని వెలిగిస్తూనే ఉంటుంది. "ఇటువంటి అద్భుతమైన వ్యక్తి ఒకరు రక్తమాంసాలతో ఈ నేలపై నడయాడేరంటే భావితరాలు విస్తుబోతారు" అని ప్రపంచ మేధావులలో అగ్రగణ్యుడైన ఐన్స్టీన్ ఆశ్చర్యం ప్రకటించారు. ఈరోజు మనకి గాంధేయ వివేకం అవసరం. గాంధేయవాదం కాదు. అన్నారు ప్రముఖ రచయిత సాల్మన్ రష్దీ. ప్రజాసేవ, దేశసేవ చేయాలనే ఉత్సాహం నాలో కలిగిందంటే అది గాంధీ రచనలను చదవటం వల్లనే. గాంధీ అంత నిరాడంబరంగా ప్రతి పార్టీ కార్యకర్త జీవితం గడపాలి. అన్నారు కమ్యూనిస్టు అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య గారు. "మానవతరాత్మకు రూప సంకేతం గాంధీజీ" అన్నారు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక క్రీస్తు రుధిర బిందువు, ఒక బుద్ధుని అభయ ముద్ర, ఒక శాంతి మంత్ర పాఠము... ఇవన్నీ కలసి గాంధీగా జన్మించాయంటారు శ్రీ గరికిపాటి. బుద్ధుని అనంతరం సంపూర్ణ మానవ సమాజానికి గొప్ప సందేశం మహా పురుషుడు గాంధీజీ ఒక్కరే అంటారు రాహుల్ సాంకృత్యాయన్.

"ఒక పిచ్చివాని చేతి తూటా తోనే నేను మరణించాల్సి వస్తే నేను చిరునవ్వుతో దానిని స్వీకరించాలి. నాకు కోపం రాకూడదు. నా హృదయం లోని, పెదవుల పైన దేవుడు ఉండాలి. మీరంతా నాకు ఒక మాట ఇవ్వాలి అదే జరిగే పక్షంలో కన్నీరు పెట్టుకోబోమని" మరణించడానికి ముందు రోజుల్లో ఆయన పలికిన ఈ మాటలు గాంధీజీ స్థాయిని తెలుపగలవు.

ఏడు పాపాల్ని ఆయన నిరసించారు.
**1.** నీతి లేని వ్యాపారం **2.** మనసు లేని ఆనందం **3.** సిద్ధాంతం లేని రాజకీయం **4.** మానవత్వం లేని శాస్త్రవిజ్ఞానం **5.** పని చేయకుండా ధన సంపాదన **6.** త్యాగం లేని పూజలు **7.** శీల నిర్మితి లేని చదువు.

సరళమైన జీవనశైలి ఉన్నతమైన ఆలోచన విధానం ప్రతి వ్యక్తికి ఆభరణం కావాలంటారు బాపూజీ. ఏ దేశవాసికైనా, ఏ కాలంలోనైనా మనిషికి "మూడు కోతులు" ఆదర్శంగా నిలవాలన్నది ఆయన ఆకాంక్ష. *Might is right* అనే ప్రాచీనోక్తిని ఆయన తిరగరాశారు. *Right is might!* అని.

సత్యాహింసలు పర్వతాలంత ప్రాచీనమైనవని చాటిచెప్పి నిరూపించిన జీవితం...గాంధీజీయే పేర్కొన్నట్లుగా "మానవ జాతికి మహత్తర సందేశం"

## నన్నయవాణి వార్షికోత్సవ శుభాకాంక్షలు!!



" నన్నయవాణి " నన్నయ విశ్వవిద్యాలయ ఇన్ హౌస్ జర్నల్ విశ్వవిద్యాలయ సమాచారాన్ని నిక్షిప్తం చేయటమే కాకుండా, విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో శీర్షికలతో సమాచారాన్ని అందించే ప్రయత్నం నిరంతరం చేస్తుంది.

వర్తమానాన్ని పరిపూర్ణంగా అనుభవించటానికి చరిత్రను మనం తప్పనిసరిగా చూడాలి.అటువంటి సందర్భంలో నన్నయవాణి గత చరిత్ర సమాచారాన్నంతటిని యూనివర్సిటీ వెబ్సైట్లో మన ముందుంచుతుంది.ఇందుకు సహకరిస్తున్న అందరికీ,సంపాదక వర్గానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**ఆచార్య జి.సుధాకర్**
**రిజిస్ట్రార్,** ANUR
**ప్రధాన సంపాదకులు,నన్నయవాణి**

## కొండ్రు మౌనికకు డాక్టరేట్ ప్రదానం



కొండ్రు మౌనికకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వీసీ కె.పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు కొండ్రు మౌనికకు డాక్టరేట్ ప్రదానం చేసి అభినందించారు. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కొండ్రు మౌనిక "ఎవల్యూషన్ ఆఫ్ హైబ్రిడ్ ఎక్స్ట్రీమ్ లెర్నింగ్ మిషన్ మోడల్స్ ఫర్ ఇంట్రూసన్ డిటెక్షన్ సిస్టమ్" అనే అంశంపై పరిశోధన చేసి అతి ముఖ్యమైన "అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ – మిషన్ లెర్నింగ్ లోని హైబ్రిడ్ అల్గోరిథంలు పై విశ్లేషణ చేసి నెట్ వర్క్ చొరబాటు గుర్తింపు వ్యవస్థలో లోతైన అధ్యయనం చేసారని మౌనికను వీసీ ప్రశంసించారు. పర్యవేక్షకులు డా.పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చక్కటి అభిరుచితో నేటి సమాజానికి ఎంతో కీలకమైన అంశంపై అధ్యయనం చేసారని, దీనికి సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ గా జె.ఎన్.టి.యు. విజయనగరం నుండి ఆచార్య డి.రాజ్యలక్ష్మీ వ్యవహరించారని అన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ కొండ్రు మౌనికను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీర్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు డా.వి.పెర్సిస్, డా.బి.కెజియా రాణి, డా.డి.లత, వివిధ శాఖల ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు మౌనిక ను అభినందించారు.

## అండర్-19 క్రికెట్ స్టేట్ టీమ్‌కు నన్నయ విద్యార్థి ఎంపిక

### టివి సాయి శ్రవణ్‌కు వీసీ అభినందనలు




సాయి శ్రవణ్ ను అభినందిస్తున్న వీసీ ఆచార్య కె.పద్మరాజు

ఆదికవి నన్నయ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో బిటెక్ సెకండియర్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి టివి సాయి శ్రవణ్ ఆంధ్రప్రదేశ్ అండర్ 19 క్రికెట్ మెన్ స్టేట్ టీమ్ కు ఎంపికయ్యాడని వీసీ ఆచార్య కె.పద్మరాజు అభినందించారు. శనివారం యూనివర్సిటీలో విద్యార్థి సాయి శ్రవణ్ ను అభినందించి వివరాలను తెలియజేసారు. 2023–24 సంవత్సరానికి బీసీసీఐ డొమెస్టిక్ సీజన్‌లో వినూ మన్కడ్ ట్రోఫీలో పాల్గొంటాడని చెప్పారు. అక్టోబర్ 2023 నుండి చండీగఢ్‌లో ఆడనున్నాడని తెలియజేసారు. శ్రవణ్ కృషిని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సుధాకర్ అభినందించారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం కోర్సు కోఆర్డినేటర్ డా.బి.లక్ష్మి, డా.ఏ.ఎం.శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావాణి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి

### (1904 అక్టోబర్ 2, - 1966 జనవరి 11 )



భారత దేశ రెండవ ప్రధానమంత్రి, భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్రధారి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు. ఆయన 1920 లో భారత స్వాతంత్ర్యోద్యమంలో తన స్నేహితుడు నితిన్ ఎస్లావత్ తో కలసి చేరారు. మహాత్మా గాంధీ ప్రభావంతో మొదట మహాత్మా గాంధీకి, తరువాత జవహర్లాల్ నెహ్రూ కు నమ్మకస్తుడైన అనుచరుడయ్యారు. 1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశ ప్రభుత్వంలోచేరి జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వంలో మొదట రైల్వే మంత్రిగా (1951– 56), తరువాత హోంమంత్రిగానే కాక ఇతర బాధ్యతలను కూడా చేపట్టారు. సమర్థులైన ప్రజా సేవకులుగా తరువాత కాలంలో ప్రధానమంత్రి కాగలిగారు. 1965 ఇండో–పాకిస్థాన్ యుద్ధం కాలంలో దేశాన్ని నడిపించారు.ఆయన నినాదం "జై జవాన్ జై కిసాన్" యుద్ధ సమయంలో బాగా ప్రాచుర్యంలోనికి వచ్చి ప్రస్తుత కాలం వరకు ప్రజల హృదయాల్లో గుర్తుండిపోయింది.

**శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారి జయంతి శుభాకాంక్షలు!!**
**- నన్నయవాణి**

## నన్నయలో శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత విజయవంతం



శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత ప్రోగ్రామ్ విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య కె.పద్మరాజు ప్రోగ్రామ్ ను ప్రారంభించి ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారు. స్వచ్ఛత కోసం ఒక గంట శ్రమదానం చేయాలని దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు అనుబంధ కళాశాలల్లోని 290 ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు ద్వారా శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత పేరుతో పరిసరాలను పరిశుభ్రపరచే కార్యక్రమాలు చేయిస్తున్నామన్నారు. ఎన్.ఎస్.ఎస్ లోని శ్రమదానం, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా ఆత్మసంతృప్తి ఉంటుందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న భారతదేశం పరిశు భ్రమైన దేశంగా తయారుకావాలని, దానిలో యువత కీలక పాత్రను పోషించాలని తెలియజేసారు. విద్యార్థులు ఇంటిలో తల్లిదండ్రులకు సహాయం చేస్తూ ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత కార్యక్రమంలో ఒక రోజులో ఒక గంట చేసి ఆపేసే కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా అలవర్చుకోవాలన్నారు. యువత సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత చేస్తున్న తొలి కార్యక్రమం అందరి శ్రమదానంతో విజయవంతం అయిందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్ లో మరిన్ని నిర్వహిస్తామని, విద్యార్థుల్లో దేశభక్తిని, సేవాదృక్పదాన్ని అలవాటు చేస్తామని తెలియజేసారు. తరువాత శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత కు సంబంధించిన ప్రతిజ్ఞను విద్యార్థులచే చేయించారు. అనంతరం వీసీ పద్మరాజు చీపురు తీసుకొని విశ్వవిద్యాలయంలోని కేంద్ర పరిపాలన భవన పరిసరాలలో శుభ్రం చేసారు. అలాగే కన్వెన్షన్ సెంటర్, సైన్స్ కాలేజ్ భవనాల సమీపంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను తొలగించారు. అలాగే యూనివర్సిటీలోని ఎనిమిది ఎన్.ఎస్.ఎస్. యూనిట్స్ ప్రోగ్రామ్ అధికారుల పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లో శ్రమదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎన్.ఉదయభాస్కర్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


## పిఆర్వో ఆనంద్‌కు జాషువా పురస్కారం


ఆనంద్ కు జాషువా పురస్కారాన్ని అందిస్తున్న వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి పువ్వల ఆనంద్ కు నవయుగ కవిచక్రవర్తి పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా పురస్కారాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు అందించి అభినందించారు. శుక్రవారం యూనివర్సిటీలో వీసీ, రిజిస్ట్రార్ లు ఆనంద్ ను సన్మానించి జాషువా పురస్కార సర్టిఫికెట్టు, జ్ఞాపికను అందజేసారు. ఈ సందర్భంగా వీసీ వివరాలను తెలియజేస్తూ గుఱ్ఱం జాషువా 128వ జయంతి ని పురస్కరించుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన గుఱ్ఱం జాషువా జయంతి సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిళ్ళంగోళ్ళ శ్రీలక్ష్మి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారని అన్నారు. ఆనంద్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ తెలుగు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జర్నలిజం చేసారని, తెలుగు సాహిత్య అభిలాషతో జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించారని తెలిపారు. జర్నలిస్టుగా సాహిత్య కార్యక్రమాలకు సాంకేతికతను జోడించి సమాజానికి అందిస్తున్నారని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ సమాచారాన్ని వార్తా పత్రికలతో పాటు నన్నయ న్యూస్ టీవీ వంటి వినూత్న సోషల్ మీడియా సాధనల ద్వారా ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఆయా సాహిత్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు పర్యావరణం, ప్రజారోగ్యం, యోగా, సమాజంలో మీడియా పాత్ర వంటి ఆన్లైన్ జాతీయ సదస్సులను నిర్వహించారని తెలిపారు. గతంలో చేసిన సాహిత్య సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఈ పురస్కారాన్ని అందుకోవటం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకార్ మాట్లాడుతూ పువ్వల ఆనంద్ నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థిగా, పి.ఆర్.వో గా, మీడియా సెల్ కోఆర్డినేటర్ గా విశ్వవిద్యాలయ సమాచారాన్ని సమాజానికి అందించడంలో చురుగ్గా పనిచేస్తారని అన్నారు. గుఱ్ఱం జాషువా పురస్కారాన్ని అందుకోవడం అభినందనీయమని, భవిష్యత్ లో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, అలుమ్ని సభ్యులు,మీడియా సెల్ మిత్రులు, విద్యార్థులు ఆనంద్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కుటుంబ సభ్యులు హరిత, జెస్సీ తదితరులు పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 28 జాషువా జయంతి

*కులమతాలుగీచుకున్న గీతలజొచ్చి*
*పంజరాన కట్టువడను నేను*
*నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు*
*తిరుగులేదు విశ్వనరుడ నేను*



*గుంటూరు జిల్లా వినుకొండలో పుట్టి విశ్వనరునిగా ఎదిగిన గుర్రం జాషువా గారి జయంతి సెప్టెంబర్ 28. తెలుగు సాహిత్యంలో భావ కవితోద్యమ వీచికలు ఉధృతంగా వీస్తున్న కాలంలో తనదైన ప్రతిభతో తన భావవ్యక్తీకరణకు పద్యాన్ని సాధనంగా చేసుకొని రచనలు చేసిన నవయుగ కవిచక్రవర్తి, మానవతావాది గుర్రం జాషువా. పద్యం ఆయన మాతృభాష! పేదల కష్టాలు,కన్నీళ్లు ఆయన కళ్ళజోడు! ఆ కళ్ళజోడులోంచి చూసి ఆయన కవిత్వాన్ని రచించారు.*

*పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి శుభాకాంక్షలు!!*

## కాకినాడ క్యాంపస్‌లో శ్రమదానం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ నందు భారత ప్రభుత్వం తలపెట్టిన "శ్రమదాన్ ఫర్ స్వచ్ఛత" అనే కార్యక్రమాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.పద్మరాజు ఆజ్ఞతో క్యాంపస్ జాతీయ సేవా సమితి( NSS )యూనిట్ వన్ అధికారి డా.ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ లో గల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది క్యాంపస్ ని ఒక గంట పాటు శ్రమదానం చేసి శుభ్రం చేశారు.



# ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవం ర్యాలీ




ఆదికవి నన్నయ యూనివర్శిటీ తాడేపల్లిగూడెం ఫార్మసీ విభాగం వారు ప్రపంచ ఫార్మసిస్ట్‌ల దినోత్సవాన్ని నిర్వహించి, మన సమాజంలో ఫార్మసిస్ట్‌ల ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ మెగా ర్యాలీని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు విశిష్ట అతిథుల నుండి ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో తాడేపల్లిగూడెంలోని ఎస్వీఆర్ సర్కిల్ నుంచి శేషమహల్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగింది. ఈ ర్యాలీలో ఔషధ వృత్తికి ప్రజాసంఘాల మద్దతు తెలియజేస్తూ ఆకట్టుకున్నారు. పాల్గొనేవారు ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్ట్‌ల పాత్రను ప్రచారం చేస్తూ సందేశాలను కలిగి ఉన్న ప్లకార్డులను పట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం మున్సిపల్ కమీషనర్ డా.ఎ.శామ్యూల్ మరియు పుర ప్రముఖులు పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా వై.ఎస్.ఆర్.సి.పి యువజన నాయకుడు కొట్టు విశాల్, ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ చైతన్య కుమార్ గౌరవ అతిథిగా క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ మరియు ఫార్మసీ కోర్స్ కోఆర్డినేటర్ డా.హీరా బట్టు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ ఎ.శామ్యూల్ మాట్లాడుతూ మందులను సురక్షితమైన మరియు ప్రభావవంతమైన వినియోగానికి భరోసా ఇవ్వడంలో ఫార్మసిస్ట్‌లు పోషించే కీలక పాత్రను తెలియజేశారు. ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో ఫార్మసీ వృత్తి సేవలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన కొట్టు విశాల్ ఫార్మసిస్ట్‌ల అంకితభావాన్ని కొనియాడారు. విద్యార్థులు ఫార్మాస్యూటికల్ సైన్స్‌లో కెరీర్‌ను కొనసాగించేలా ప్రోత్సహించారు, వారి కోసం ఎదురు చూస్తున్న ఆశాజనక భవిష్యత్తును గుర్తించారు. గౌరవ అతిథి డాక్టర్ చైతన్య కుమార్ ప్రజారోగ్యం మరియు ఆరోగ్య సంరక్షణ డెలివరీ వ్యవస్థలలో ఫార్మసిస్ట్‌ల ప్రాముఖ్యతను చెప్పారు. భవిష్యత్ ఫార్మసిస్ట్‌లకు విద్యాబోధన చేయడంలో విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ ర్యాలీ ఫార్మసీ వృత్తికి సంబంధించిన వేడుకగా మాత్రమే కాకుండా, సమాజంలో ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంలో విద్యార్థులు తమ నిబద్ధతను ప్రదర్శించడానికి వేదికగా కూడా నిలిచింది. ఇది రోగి సంరక్షణ, మందుల నిర్వహణ మరియు ఆరోగ్య సంరక్షణ న్యాయవాదంలో ఫార్మసిస్ట్‌లు పోషించే కీలక పాత్రను గుర్తు చేస్తుంది. ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగం ఆచార్యులు ఫార్మసిస్ట్‌ల దినోత్సవాన్ని విజయవంతం చేసినందుకు భాగస్వాములు, అతిథులు మరియు మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## Indian History

1. ఆర్యుల తొలి చరిత్రను తెలుసుకొనుటకు ముఖ్య ఆధారం ఏది - **ఋగ్వేదము**
2. భారతదేశంలో ఎవరితో నాణెముల యుగం ఆరంభమైనది - **ఇండో బాక్ట్రియన్ గ్రీకు రాజులతో**
3. ఆర్యులు మన దేశమునకు ఎట్లువలస వచ్చినారో తెలియజేయు శాసనము ఏది -**బోగజ్ కోయి శాసనం**
4. ముద్రా రాక్షసము అని నాటకమును ఎవరు రచించారు - **విశాఖ దత్తుడు**
5. భారతదేశము వివిధ జాతుల చోద్యమైన ప్రదర్శనశాల అని ఏ చరిత్రకారుడు అన్నాడు - **వి. ఏ .స్మిత్**
6. రెండవ చంద్రగుప్తుని కాలంలో భారతదేశాన్ని సందర్శించే సందర్శించిన చైనా యాత్రికుడు ఎవరు - **పాహియాన్**
7. విష్ణు పురాణము ఏ రాజుల చరిత్రను తెలియజేయును - **మౌర్య రాజులు**
8. కలింగ చక్రవర్తి అయినా ఖారవేలుని విజయములను సూచించు శాసనము - **హాతిగుంఫ శాసనము**
9. పాత రాతియుగమునకు సంబంధించిన నిదర్శనం ఎక్కడ కనపడింది - **కర్నూలు, రాయగడ్ నందలి సింగ్యపూర్ గుహలలో**
10. నవీన శిలాయుగంలో ధాన్యం పండించారనడానికి చిహ్నాలు ఎక్కడ లభ్యమైనాయి - **అలహాబాద్**




## INDIAN ECONOMY

1)భారతదేశంలో ప్రణాళిక విధానం.... **( కేంద్రీకృత ప్రణాళిక)**

2)కాలాన్ని ఆధారంగా చేసుకుని పరిశీలించి నప్పుడు భారత్‌లోగల ప్రణాళికలు.....**(మధ్యకాలిక ప్రణాళిక)**

3)1991 కి పూర్వం భారత విదేశీ వ్యాపార విధానం ప్రాధాన్యత....**(దిగుమతుల ప్రతిస్థాపనకు ప్రాధాన్యం)**

4)"పేరా" చట్టాన్ని ఎందుకు తెచ్చారు.....**(విదేశీమారక నియంత్రణకై)**

5)"సరళీకరణ అనగా".....**( ప్రభిత్వ జోక్యమ్ తగ్గించి మార్కెట్ శక్తులను స్వేచ్ఛనివ్వడం)**

6)ఆర్థిక సంస్కరణలో భాగంగా భారతదేశంలో "శ్రామిక సంస్కరణలు" తెచ్చారు దీనివల్ల ఎవరు లబ్ది పొందారు....**(యజమాని)**

7)నూతన ఆర్థిక విధానం ప్రారంభం తరువాత.... **(ప్రాథమికంగా గ్రామీణ దారిద్ర్యం పెరిగింది కాని 1993-1994 లో తగ్గింది)**

8)మాంగనీస్ ఖనిజం అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం....**(ఒరిస్సా)**

9)ఈ కింది వానిలో సరైన ప్రవచనం

ఎ. భారతదేశంలో 1901-51 మధ్యకాలంలో జనాభా పెరుగుదల కంటే 1951-2001 మధ్యకాలంలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంటుంది

బి. 1901-2001 మధ్యకాలంలో మొత్తం 100 సం.లలో నాలుగు రెట్ల కంటే ఎక్కువగా జనాభా పెరిగింది

**....... ( రెండూ సరైనవే)**

10)సాంకేతిక ప్రగతి మరియు నిరుద్యోగిత రేటుల మధ్య సంబంధం....**(అనులోమ)**

## INDIAN POLITY

1)ఏ కేసులో OBC క్రిమిలేయర్ ను ప్రస్తావించారు...**(ఇందిరా సహాని V/s యునియన్ ఆఫ్ ఇండియా)**

2)ఎటువంటి విచక్షణ లేకుండా ప్రభుత్వోద్యాగానికి అందరు అర్హులేనని పేర్కొన్న చట్టం ఏది....**(1833 చార్టార్ చట్టం)**

3)భారతీయ రాష్టాంలో స్వీయ శాసన నిర్మాణ అధికారం లేకుండా ఛేసిన చట్టం **....(1853)**

4)ప్రవేశికలో చేర్చిన సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయం అనే పదాలు ఏదేశం నుండి గ్రహించారు....**(రష్యా)**

5)భారతదేశంలో ప్రాథమిక హక్కులను గూర్చి తోలిసారి ప్రతిపాదించింది....**(మొట్టమొదటి సారిగా 1895 లో "స్వరాజ్య బిల్లులో" భాలగంగాధర్ తిలక్ ప్రాథమిక హక్కులను ప్రతిపాదించారు)**

6)ప్రాథమిక విదులు పాఠ్యగ్రంథాల్లో చేర్చి విధ్యార్థులకు చేప్పాలని ఎవరు పేర్కొన్నారు....**(1999 లో ప్రాథమిక విదుల అమలుపై పార్లమెంటరీ కమిటీ ఒక నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం పాఠ్యగ్రంధాల్లో ప్రాథమిక విదులు చేర్చారు)**

7)ఏ రాజ్యాంగ ప్రతిపాదనలలో తోలిసారిగా ఆదేశిక సూత్రాలు చోటు చేసుకున్నాయి.....**(తేజ్ బహదూర్ సప్రు కమిటి)**

8)ఆదేశ సూత్రాలు సక్రమంగా అమలు పరిచినట్లు అయితే మన దేశం భూతల స్వర్గంగా మారుతుంది. అని పేర్కొన్నది....**( M.C చాగ్ల)**


9)రాష్ట్రపతి ఎన్నికల వివాదాలను పరిస్కరించేది....**(ఆర్టికల్ 71ప్రకారం రాష్ట్రపతి ఎన్నికల వివాదాలను సుప్రీంకోర్టు లోనే పరిష్కరించుకోవాలి. ఇది సుప్రీంకోర్టు ప్రారంబ పరిది కిందకు వస్తుంది)**

10)స్థానిక సంస్థల పటిష్టత కోసం 1907 లో నియమించిన రాయల్ అధ్యక్షుడు ఎవరు.... **( హాబ్‌హౌస్ - 1907 లో రాయల్ కమీషన్ ను హబ్ హౌస్ నాయకత్వంలో ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ సూచన మేరకే మింటో మార్లే సంస్కరణల చట్టంలో స్థానిక సంస్థల ప్రతినిధులను ప్రజలచేత ఎన్నుకునే పద్ధతి ప్రవేశ పెట్టారు)**

- డా.శ్రీధర్

# గాంధీయిజం

"ఒక చెంప మీద కొడితే మరో చెంప చూపించాలి" అది సాధ్యమేనా? "సత్యమే మనిషి జీవితానికి అసలైన గుర్తింపు" కానీ ఈ కాలంలో సత్యాన్ని పాటించే వాళ్ళు ఉన్నారా? "స్వరాజ్యమనే ఫలాలు అందరికీ అందాలి" ఈ సూక్తులు మహాత్మా గాంధీవి. 21వ శతాబ్దంలో చాలామందిని ప్రభావితం చేసిన మాటలివి. ప్రపంచానికి పరిచయం అక్కర్లేని పేరు మహాత్మా గాంధీ. భారతీయులకు ఆయన మహాత్ముడు, జాతిపిత,స్ఫూర్తి ప్రదాత. స్వాతంత్ర్యం కోసం కోట్లాదిమంది ప్రజలను ఏకతాటిపై నడిచేలా చేసిన వ్యక్తి. దీనికోసం ఆయన పడిన తపన,పాటించిన విలువలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతాయి. ఇప్పటిలా మీడియా,సోషల్ మీడియా లేని ఆ రోజుల్లో క్విట్ ఇండియా,ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాలు చేపట్టి ప్రజలందరినీ ఏకంచేసిన విధానం చరిత్రలో చిర స్థాయిగా నిలిచిపోతుంది. సత్యం,అహింస,స్వదేశం, స్వరాజ్యం,మత సామరస్యం,మహిళా సాధికారిక,పరిశుభ్రత ఇలా ఒక్కటేమిటి ఎన్నో వాటిలో ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు మనకే కాదు ప్రపంచానికంతటికి ఒక దారి చూపాయి. దేశాల మధ్య యుద్ధాలు,గొడవలు రాకుండా ఉండాలంటే 'మనుషులంతా ఒక్కటే' అనే ఆలోచన అందరిలో రావాలన్నారు. ప్రపంచానికంతటికి ఒకే గవర్నమెంట్ లాంటి వ్యవస్థ ఉండాలని అలా ఉన్నప్పుడే ప్రపంచమంతా ఒక్కటిగా ఉంటుందన్న ఆయన ఆలోచన నిజంగా కాదనదగ్గ నిజం. సైనికులు,అనుచరులు అండతో చెలరేగిపోయే నాయకులు,చట్టాన్ని, ప్రజల్ని గాలికి వదిలేసే ప్రభుత్వాలకు గాంధీ పూర్తి వ్యతిరేకం. అందుకే డబ్బు, అధికారం ఏమీ లేకపోయినా ఆయన్ని కోట్లాదిమంది జనం నమ్మారు.



స్వేచ్ఛ కోసం, స్వాతంత్రం కోసం గాంధీ నడిపించిన మార్గం ఎంతో గొప్పది. అన్ని మతాల వాళ్ళు కలిసిమెలిసి ఉండాలని గాంధీ కోరిక. అందుకోసం అన్ని మతాలను గౌరవించాలి అంటూ గాంధీ "సర్వ ధర్మ సంభవ్"అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. మతం అంటే 'ఇద్దరి మనుషుల్ని వేరు చేసేది కాదని..ఇద్దరి వ్యక్తుల్ని కలిపేదని' చెప్పారు. అలాగే మనిషి జీవితానికి దారి చూపే వెలుగు చదువు ఒక్కటే అని గాంధీ విశ్వాసం. చదువు అంటే కేవలం అక్షరాలు నేర్చుకోవడమే కాదని మంచి వ్యక్తులుగా మారేందుకు అదొక సాధనమని చెప్పారు. అలాగే అధికారం అనేది ఒకరి చేతిలో ఉండకూడదని చెప్పి 'అధికార వికేంద్రీకరణ' జరగాలన్నారు. అధికారాన్ని పంచుకుంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేస్తారని గాంధీ భావన.

గాంధీ పేరు వినగానే మనకు గుర్తుకొచ్చేది అహింస. గాంధీ దృష్టిలో బలమైన ఆయుధం ఇది."అహింస బలహీనమైన ఆయుధం కాదని దాన్ని పాటించాలంటే ఎంతో ధైర్యం,సహనం ఉండాలన్నారు". అందుకే దలైలామా,మార్టిన్ లూథర్ కింగ్,నెల్సన్ మండేలా వంటి ప్రపంచ స్థాయి నేతలకు మార్గదర్శకంగా నిలిచారు. అలాగే మహిళా సాధికారత విషయంలో గాంధీ ఆలోచనలు,సిద్ధాంతాలు చాలా గొప్పవి. సహనం, అహింస మహిళల సహజ లక్షణాలని అందువల్ల వాళ్లు స్వాతంత్ర పోరాటంలో ఉండాలని చెప్పారు. మహిళల చదువు విషయంలో గాంధీ చాలా కృషి చేశారు. గాంధీ చేసిన కృషి వల్ల పురుషాధిక్యత ఉన్న ఆ కాలంలో మహిళలు ముందుకు వచ్చి చదువుకోవడమే కాకుండా, జాతీయ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. చివరిగా చెప్పేదేమిటంటే మహాత్మాగాంధీ అంటే ఒక సుదీర్ఘమైన అధ్యాయం. గాంధీ గురించి ఎంత చెప్పుకున్న..ఎంత చదువుకున్నా తక్కువే. గాంధీయవాదంగా పిలవబడుతున్న ఆయన ఆలోచనలు,చెప్పిన సిద్ధాంతాల్లో సగం పాటించినా మనం అద్భుతమైన వ్యక్తులుగా మారడమే కాకుండా.. అద్భుతమైన సమాజాన్ని కూడా నిర్మించిన వాళ్ళమవుతాం.

- బి.సుశాంత్ కుమార్

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in